రేపు జాబ్ మేళా

మెహిదీపట్నం మే 9 : నిరుద్యోగుల కోసం లయన్స్ క్లబ్ (గ్రీన్ ల్యాండ్), పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 11న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు డాక్టర్ విజయలక్ష్మి గురుసెవర్, డాక్టర్ విద్యాభూషణ్ ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లొమా/ఐటీఐ అర్హతతో ఎస్ఎంటీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 370 ఉద్యోగాలు, 10వ తరగతి, ఇంటర్మీడియట్ అర్హతతో ఎస్ఎంటీ ఆపరేటర్స్ 180ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వయో పరిమిత 33 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగులు10వ తేదీ లోపు 9542433427 నంబర్‌లో సంప్రదించాలని సూచిస్తున్నారు. 11వ తేదీన సికింద్రాబాద్ బోయిగూడ ఆర్యసమాజ్ సమీపంలో గుజరాతి హైస్కూల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయని, దరఖాస్తు చేసుకోలేని వారు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరవస్తు మధుకర్‌స్వామి తెలిపారు.

ఐస్‌క్రీం చూపి.. అసభ్య ప్రవర్తన

ఘట్‌కేసర్, మే 9 : ఆరేండ్ల బాలికకు ఐస్‌క్రీం ఆశ చూపి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీనగర్‌లో గురువారం చోటుచేసుకున్నది. ఘట్‌కేసర్ సీఐ సైదులు కథనం ప్రకారం.. జ్ఞానేంద్ర(22) ఘట్‌కేసర్‌లో తిరుగుతూ ఐస్‌క్రీం విక్రయిస్తుంటాడు. బాలాజీనగర్‌కు చెందిన ఓ ఆరేండ్ల చిన్నారికి ప్రతిరోజూ ఐక్రీం ఉచితంగా ఇస్తుంటాడు. అయితే గురువారం ఐస్‌క్రీం ఆశచూపిన జ్ఞానేంద్ర ఆ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పీజీ వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

సుల్తాన్‌బజార్, మే 9 : వేదింపులు తాళలేక పీజీ వైద్యురాలు ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. ఉస్మానియా దవాఖానలో పీజీ వైద్యురాలిని సదరు విభాగాధిపతి వేదింపులకు గురిచేస్తున్నాడు. తన మాట కచ్చితంగా వినాల్సిందేనని వైద్యురాలిపై ఒత్తిడి తీసుకువచ్చాడు. వైద్యురాలి తండ్రికి ఫోన్ చేసి లేనిపోనివి కల్పించి చెప్పాడు. అంతే కాకుండా వైద్యురాలిని హాస్టల్ గదిలో బంధించి ఉంచేందుకు కూడా యత్నించినట్టు సమాచారం. దీంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురైన వైద్యురాలు ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయమై ఫిర్యాదు అందుకున్న తెలంగాణ వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ వాణి గురువారం ఉస్మానియా దవాఖానలో సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణి, ఆర్ఎంవోల సమక్షంలో సుమారు 7 గంటల పాటు పీజీ వైద్యురాలిని, సదరు విభాగాధిపతిని విచారణ చేసినట్లు తెలిసింది. కాగా ఈ విచారణ తిరిగి మంగళవారం కూడా కొనసాగనున్నది.

బీసీ బిడ్డను గెలిపించుకుందాం

హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు ఓటు ఎందుకేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదన చారి

బడంగ్‌పేట, మే 9 : అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలని మాజీ స్పీకర్ మధుసూదన చారి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో మహేశ్వరం నియోజకవర్గం విశ్వకర్మ మన్మయ సంఘం ప్రెసిడెంట్ క్రిష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస చారి ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిర్వహించిన సమావేశానికి మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదన చారి, తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ పెడరేషన్ అధ్యక్షుడు ధాన కర్ణాచారి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. విశ్వకర్మ మన్మయ సంఘం సభ్యులందరు కాసానికి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు న్యాయం జరిగిందంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వల్లనే అన్నారు. చేతి వృత్తులు, కుల వృత్తులకు జీవం పోసింది కేసీఆర్ అన్నారు. ఇచ్చిన గ్యారంటీలు ఎందుకు అమలు చేయలేదో కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని తెలిపారు. బీజేపీకి ఓట్లు వేస్తే అంతా ప్రైవేట్ పరం చేస్తారని, సంపన్న వర్గాలకు బీజేపీ దేశ సంపదను దార దత్తం చేయబోతుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో కరెంటు అదో గతి అయ్యిందని తెలిపారు. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోటేశ్ చారి, రమాచారి, వెంకటాచారి, కార్పొరేటర్లు భూపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

మీర్‌పేటలో మాజీ స్పీకర్ మధుసూదన చారి చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు విశ్వకర్మ సంఘం మద్దతు

అన్ని వర్గాల మద్దతు బీఆర్ఎస్‌కే

ఎర్రగడ్డలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాగంటి

షేక్ జావిద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, మే 9 : సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ విజయానికి అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌కు చెందిన ప్రముఖ మైనార్టీ నాయకుడు షేక్ జావిద్ ఆధ్వర్యంలో గురువారం ఎర్రగడ్డలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై ప్రసంగించారు. కేసీఆర్ బస్సు యాత్రకు తెలంగాణ వ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తుండటాన్ని కాంగ్రెస్, బీజేపీలు జీర్ణించుకోలేక పోతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంజీవ, మహ్మద్‌ఖాన్, జహంగీర్, సయ్యద్‌రసూల్, అజీమ్, అజీజ్, శ్రీకాంత్, సంతుగౌడ్, బాలు, నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, కల్యాణి, ఉష తదితరులు పాల్గొన్నారు.

పద్మారావును గెలిపించుకుందాం

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో తెలిపించాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం బోరబండలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని తెలిపారు. పార్లమెంటులో తెలంగాణకు సంబంధించిన అన్ని అంశాలపై గట్టిగా ప్రశ్నించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, విజయకుమార్, విజయసింహ, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆటో డ్రైవర్లు

డ్రైవర్ల బతుకును నాశనం చేసింది..కాంగ్రెస్ పార్టీయే

కేసీఆర్ పాలనలోనే బాగున్నాం.. బీఆర్ఎస్‌కే ఓటు వేస్తాం
కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుతాం
రాష్ట్ర వ్యాప్తంగా ఆటో స్టాండ్‌ల వద్ద ప్లకార్డులతో ప్రచారం
బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆటో డ్రైవర్లు

సిటీబ్యూరో, మే 9 (నమస్తే తెలంగాణ) : డ్రైవర్ల చావుకు కారణమైన కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో కచ్చితంగా బుద్ధి చెబుతామని టీఏటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు, బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య అన్నారు. బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డ్రైవర్లతో రౌంట్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల బతుకును నాశనం చేసిన కాంగ్రెస్ పార్టీ ఓటమియే లక్ష్యంగా పనిచేస్తున్నామని, డ్రైవర్లమంతా రాష్ట్ర వ్యాప్తంగా కూడళ్లలో కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ ఉపాధిని దెబ్బకొట్టి ఏడాదికి రూ.12వేలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించడం అన్యాయమని అన్నారు. నెలకు రూ.15వేలు ఇవ్వాలని డ్రైవర్లు అందరూ డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో డ్రైవర్లు ఉపాధి లేక చనిపోతున్నప్పటికీ బీజేపీ కూడా ఏ మాత్రం మాట్లాడకుండా చోద్యం చూస్తుందని విమర్శించారు. కేసీఆర్ పాలనలోనే డ్రైవర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారని కొనియాడారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాతం రమేశ్, నీరంజన్, ఎం.శ్రీనివాస్, మహ్మద్ ఆరిఫ్, షేక్ అహ్మద్, ఎం.సోములు తదితరులు పాల్గొన్నారు.

బీసీల దమ్మేందో చూపిద్దాం

- బీసీలకు దమ్ము లేదని అవమానించిన కాంగ్రెస్‌కు బుద్ధిచెబుదాం
- ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖండించలేదెందుకు.?
- బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు.. తప్పడు వార్తలు నమ్మొద్దు
- కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

దుర్గా కన్వెన్షన్ హాల్‌లో జరిగిన బడుగు, బలహీన వర్గాల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్.

మైలార్‌దేవ్‌పల్లి, మే 9 : దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డి దురహంకారంతో మాట్లాడారని, అతడి సవాల్‌ను స్వీకరించి బీసీల సత్తా చూపాలని, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ పిలుపునిచ్చారు. మోహన్‌రెడ్డి వ్యాఖ్యలను ఇప్పటివరకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఖండించలేదని మండిపడ్డారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గా కన్వెన్షన్‌లో నిర్వహించిన బడుగు, బలహీన వర్గాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని కోరారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న పుకార్లను ప్రజలు నమ్మవద్దన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు బీఆర్ఎస్‌లో సంతృప్తిగా ఉందన్నారు. కేసీఆర్ తెలంగాణను పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. కేసీఆర్‌కు ప్రజలు ఈ ఎన్నికల్లో బ్రహ్మరథం పడుతున్నారన్నాని చెప్పారు. కేసీఆర్‌తోనే భవిష్యత్‌లో కూడా పయనిస్తానన్నారు. ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తరపున బీసీ అభ్యర్థులు బరిలో ఉన్నారని.. బీసీలకు ఎక్కువ సంఖ్యలో టికెట్లు ఇచ్చిన బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. మిగిలిన రెండు రోజులు బాగా కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాగేందర్‌గౌడ్, పురుషోత్తం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్, యువజన నాయకుడు రఘుయాదవ్, రఘుగౌడ్, రాముయాదవ్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకుడు యాదగిరి, తదితరులు

శంషాబాద్ రూరల్, మే 9: బీఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు యాదగిరి గురువారం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ సమక్షంలో 50 మంది నాయకులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపుకోసం పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యాదగిరి, మండల ఉపాధ్యక్షుడు ఎకాంత్‌గౌడ్, కుమ్మరి రమేశ్, ఈశ్వరయ్య, మధు, కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

16నుంచి నోవాటెల్‌లో 'హైలైఫ్' ఎగ్జిబిషన్

బంజారాహిల్స్, మే 9 : మే 16నుంచి 18 వరకు మాదాపూర్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో 'హైలైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. గురువారం బంజారాహిల్స్‌లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన కట్టెన్ రైజర్ కార్యక్రమంలో టాలీవుడ్ హీరోయిన్లు అమీక్ష పవార్, ప్రియాంక చౌదరి, ప్రీతిసుందర్, స్రవంతి, ప్రాచీ బ్రోచర్లను ఆవిష్కరించారు.

జోస్ ఆలుక్కాస్‌లో బిగ్‌బాస్ సీజన్ 7 విన్నర్‌కు డైమండ్ నెక్లెస్ బహూకరణ

జూబ్లీహిల్స్, మే 9 : జోస్ ఆలుక్కాస్ బేగంపేట్ బ్రాంచ్‌లో గురువారం బిగ్‌బాస్ సీజన్ 7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌కు బిగ్‌బాస్ హౌస్‌లో ప్రకటించిన విధంగా సంస్థ ఎండీ జాన్ అలుకా అత్యంత విలువైన డైమండ్ నెక్లెస్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో నిస్సాతులైన వారిని ప్రోత్సహించడంలో జోస్ ఆలుక్కాస్ ముందుంటుందని.. ఇకముందు కూడా ఇలాంటి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ లెనో, షోరూం మేనేజర్ సనోజ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా మొక్కజొన్నకు డిమాండ్

డిప్యూటీ డైరెక్టర్ జనరల్ క్రాఫ్ సైన్స్ డా.టీఆర్ శర్మ

డిప్యూటీ డైరెక్టర్ జనరల్ క్రాఫ్ సైన్స్ డా.టీఆర్ శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, మే 9 : దేశవ్యాప్తంగా మొక్కజొన్నకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ఇండియన్ కౌన్సిల్ అఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏరా) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ క్రాఫ్ సైన్స్ డా.టీఆర్ శర్మ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థ, లుధియాన సంయుక్తంగా నిర్వహిస్తున్న 67వ మొక్క జొన్న పరిశోధనా కేంద్రాల వార్షిక సమావేశంలో రెండవ రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటూ వాతావరణ మార్పులను తట్టుకునే వంగడాల సహాయంతో మొక్కజొన్న ఉత్పత్తిని అధికం చేయాలని అన్నారు. డ్రోన్, శాటిలైట్, ఆర్టిఫిషియల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన టెక్నాలజీని విరివిగా ఉపయోగించాలన్నారు. పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. దాదాపు 165 దేశాల్లో మొక్కజొన్నను సాగుచేస్తున్నట్లు పీజేటీఎస్ఏయూ ఇన్‌చార్జి పరిశోధనా సంచాలకులు డా.పి.రఘురామి రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో ఐసీఏఆర్ ఫుడ్, పాడర్ క్రాఫ్స్ డైరెక్టర్ డా.ఎస్‌కే ప్రధాన్, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ సీడ్ డా.డీకే యాదవ, భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా.హెచ్ఎస్ జాట్, నోడల్ అధికారి డా.రమేశ్ కుమార్, పరిశోధనాకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.ఎంవీ నాగేశ్ కుమార్, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ ఐసీఏఆర్ సంస్థల సంచాలకులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, రైతులు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరో ఇద్దరికి గాయాలు

శామీర్‌పేట, మే 9 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ నుంచి అసిఫాబాద్‌కు పల్సర్ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు రవి(26), గణేశ్, సగాయ్ వెళ్తున్నారు. లాల్‌గడి మలక్‌పేట జంక్షన్ వద్ద వారు ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు జీనోమ్‌వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.